క్లుప్తంగా

నిరంతర సాధన ప్రగతికి సోపానం



విజయవాడ కల్చరల్: నిరంతరం సాధన ప్రగతికి సోపానమని సంస్కారభారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ అన్నారు. సంస్కారభారతి విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో 10 రోజులుగా అయోధ్యనగర్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తున్న సంగీత శిక్షణా శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీత సాధన వల్ల ఏకాగ్రత అలవాటు అవుతుందని చెప్పారు. గాత్రంతో వాక్ స్పష్టత వస్తుందని తెలిపారు. భాషలో ఉచ్చరణ దోషాలు పోతాయని పేర్కొన్నారు. శిబిరంలో భగవద్గీత, లలిత, శాస్త్రీయ సంగీతంలో శిక్షణ ఇచ్చామన్నారు. సంగీత శిక్షకురాలు కె.నాగలక్ష్మి మాట్లాడుతూ శాస్త్రీయ సంగీత విలువలను కాపాడుకోవాలని సూచించారు. సంస్కారభారతి నగర అధ్యక్షుడు భాస్కరశర్మ, దుర్గా శ్రీనివాస్, అల్లు రాంబాబు, ఎం.జ్యోతి, సాయి శంకర్, శివకుమార్ పాల్గొన్నారు. శిక్షణలో పాల్గొన్న చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

కేంద్రీయ విద్యాలయంలో భారతీయ భాషా సంఘం వారోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్):బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో బుధవారం భారతీయ భాషా సంఘం వారోత్సవం ఘనంగా నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ ప్రణీషసేన్ బెంగాళీ భాష, సంస్కృతి గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్.ఆదిశేష శర్మ మాట్లాడుతూ ఆరు నుంచి 8 తరగతుల విద్యార్థులకు బెంగాళీ భాష, సంస్కృతి సంప్రదాయాలు, పరిజ్ఞానం తెలియ చేసేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్



మధురానగర్(విజయవాడసెంట్రల్):తెలుగు జ్యోతి ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ముత్యాలంపాడులో మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తి రాజు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో బుధవారం ఎన్టీ రామారావు జయంతి కార్యక్రమం జరిగింది.

విజయవాడలీగల్: నందమూరి తారక రామారావు 102 వ జయంతి సందర్భంగా బుధవారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జూబిలీ ఇండోర్ సబ్ స్టేషన్ 11 కేవీ జోర్నకల్ రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం గురువారం ఉదయం 8 గంటల నుంచి10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ గెస్ట్ హౌస్, గోపాలరెడ్డి రోడ్డు, డీజీపీ ఆఫీస్, నాగేంద్రస్వామి గుడి ఏరియా, సాయిరామ్ హోటల్ ఏరియా, ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ హాస్పిటల్ ఏరియా, ప్రకాశం రోడ్డు, విష్ణువర్ధనరావు వీధి, కాశేశ్వరావు రోడ్, వెంకటరత్నం వీధి, నరసింహారావు నాయుడు వీధి, గోవింద రాజులు నాయుడు వీధి, తాడేపల్లి వారి వీధి, పీసపాటి వారి వీధి, భవానీ వీధి, మాదిరెడ్డి వారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

బ్యూటీకేర్ అసిస్టెంట్ కోర్సులో శిక్షణ తరగతులు

మొగల్రాజపురం: నిరుద్యోగ యువతులు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బ్యూటీకేర్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారు ఈ కోర్సులో శిక్షణ పొందడానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు జూన్ 3వ తేదీలోగా పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను తీసుకొని రావిచెట్టుసెంటర్‌లో ఉన్న జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పార్కుల్లో ఆహ్లాదం కరువు!

- నిర్వహణ పట్టించుకోని వీఎంసీ
- చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు నెలవు
- అధికారులు స్పందించాలని వినతి



రాజీవ్‌నగర్ పార్కులో చెత్త డంపింగ్

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఏర్పాటు చేసిన పార్కులు ప్రస్తుతం అనారోగ్యాలను పంచే ప్రాంతాలుగా మారిపోయాయి. పార్కుల నిర్వహణను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పట్టించుకోకపోవడంతో చెత్త డంపింగ్ కేంద్రాలను తలపిస్తున్నాయి. పార్కులు చెత్తాచెదారంతో పేరుకుపోయి కనిపిస్తున్నాయి. పర్యవేక్షించే వారు లేక పోవడంతో ప్రారంభించి ఏడాది కాక ముందే పూర్తి అధ్వానంగా మారిపోయాయి. 63వ డివిజన్ రాజీవ్‌నగర్లోని పార్కు పేరుకే పార్కు. చుట్టుపక్కల వారు కార్లను, ఆటోలను పార్కు చేస్తుండటంతో పార్కు కాస్త పార్కింగ్ స్థలంగా మారిపోయింది. కారులు రాకపోకలతో వర్షానికి గోతులు పడి పిల్లలు ఆడుకునేందుకు వీల్లేకుండా తయారైంది. సమీప గృహాల వారు చెత్త చెదారం పార్కులో వేయడంతో చెత్తడంపింగ్ కేంద్రంగా కనిపిస్తుంది. పార్కు ఐరన్ గేటు ఒక రెక్కను కొందరు దుండగులు కట్‌చేసి తీసుకెళ్లారంటే పరిస్థితి పర్యవేక్షణ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాత్రి పగలు తేడా లేకుండా ఆకతాయిలు అక్కడే తిష్టవేసి వారి అవసరాలను తీర్చుకుంటున్నారు. పార్కులో ఉన్న బోరు చెడిపోయి నెలలు గడుస్తున్నా పట్టించుకున్న వారే లేరని స్థానికులు చెబుతున్నారు. సాయంత్రం వేళ సేద తీరేందుకు వృద్ధులు పార్కులోకి వెళితే కనీసం కూర్చునేందుకు బల్లలు కూడా లేకుండా పోయాయి.



ఆవరణలో పార్కు చేసిన కారు

వర్షం వస్తే మరీ దారుణం....

వర్షం వస్తే వర్షం నీరు పార్కులోనే నిల్వ ఉంటుంది. ఆ పార్కును అభివృద్ధి చేయాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిపాదించినా ఇంత వరకు కనీసం గేటు కూడా పెట్టిన దాఖలాలు లేవు. ఆ ప్రాంతంలోని బడుగు బలహీన వర్గాల పిల్లలు పార్కుల్లో ఆహ్లాద కరమైన వాతావరణానికి నోచుకోవడం లేదు. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసుకునేందుకు వాకింగ్ ట్రాక్‌లేదు. ఉడా కాలనీలో పార్కు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని సదుపాయాలతో ప్రారంభించి సంవత్సరం కాకముందే అసౌకర్యాలకు నిలయంగా మారింది. రాజీవ్ నగర్లోని ఓపెన్ ఆడిటోరియం చీకట్లో గంజాయి బ్యాచ్‌కు నివాసయోగ్యంగా ఉపయోగించుకుంటున్నారని స్థానికులు అంటున్నారు. రాధానగర్లో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయడంతో అక్కడ పార్కు వాతావరణం కనిపించడం లేదు. భవానీబార్ సమీపంలోని పలగాని పార్కు చుట్టూ ఉన్న ఐరన్ ఫెన్సింగ్ తొలగించి ఉండటంతో కార్లు, ఆటోలు, లారీలకు పార్కింగ్ ప్రాంతంలా మారిపోయింది. పార్కు రూపాన్ని కోల్పోయి కనస్ట్రక్షన్ మెటీరియల్స్‌తో నిండి ఉంది. ప్రజాశక్తి నగర్లో కమ్యూనిటీ హాలు పక్కనే ఉన్న పార్కు మరమ్మతులకు నోచుకోక అలంకారప్రాయంగా మారింది. విలేజి కుండావారి కండ్రికలో వాటర్ ట్యాంక్‌కు సమీపంలో ఉన్న పార్కు ఆక్రమణలో ఉంది. ఆక్రమణలు తొలగించి పార్కును అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అభివృద్ధి చేయాలి



నగర శివారు ప్రాంతమైన ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్, కండ్రిక పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి పార్కులు అభివృద్ధి చేసి వినియోగంలోకి తేవాలి. పిల్లలు పార్కులో ఆటలాడుకునేందుకు పెద్దలు సేదతీరేందుకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలి.

– కంది రాము, ప్రకాష్‌నగర్

వాకింగ్ ట్రాక్‌లు నిర్మించాలి



పార్కుల్లో వెంటనే వాకింగ్ ట్రాక్‌లు నిర్మించాలి. దీని వల్ల సమీప ప్రాంతాల్లో ప్రజలు ఉదయం, సాయంత్రం వేళ పార్కుల్లో నడిచేందుకు వీలుంటుంది. ఆరోగ్యం కాపాడుకునేందుకు పార్కులు అభివృద్ధి చేయాలి. చిన్న పిల్లలకు అవసరమైన ఆట పరికరాలను సైతం సమకూర్చాలి.

–అన్నం శివకుమారి

'ఆచంట' నటన అజరామరం



ఆచంట విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు, నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగు వారికి మాత్రమే సొంతమైన పద్య నాటకాల్లో విశేష ప్రతిభాపాటవాలను ప్రదర్శించి రంగస్థల రారాజుగా కీర్తిప్రతిష్టలు గడించిన ఆచంట వెంకట రత్నం నాయుడి నటన అజరామరమని పలువురు కళాకారులు, కళాసంస్థల నిర్వాహకులు కొనియాడారు. ఆచంట జయంతిని పురస్కరించుకుని తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలోని ఆయన కాంస్య విగ్రహం వద్ద బుధవారం ఘన నివాళులర్పించారు. ఏపీ నటీనట, నాట్య వృత్తి కళాకారులు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ.. రంగస్థల రారాజుగా విరాజిల్లి తనదైన ప్రత్యేక శైలితో నటించి ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న మహానటుడు ఆచంట అన్నారు. అటువంటి మహోన్నత నటుడు ఉమ్మడి కృష్ణాజిల్లాలో జన్మించడం జిల్లావాసులకు గర్వకారణమన్నారు. ఆయన తనయుడు ఆచంట బాలాజీ నాయుడు తండ్రి నటనా వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని గొప్ప పౌరాణిక నటుడిగా ఎదగటం అభినందనీయమని పేర్కొన్నారు.

ఆచంట చిరస్మరణీయుడు..

పౌరాణిక నటుడు నరాలశెట్టి రవికుమార్ మాట్లాడుతూ.. అచంట సమక్షంలో సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించి ఆయన ప్రశంసలు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కంది గంగాధరరావు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా ఆచంటతో ఉన్న తన అనుబంధాన్ని గుర్తు చేశారు. కళాపోషకులు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ దుర్యోధన ఏకపాత్రాభినయంతో గుర్తింపు పొందిన అనంతరం పద్యనాటక రంగంలో వైవిధ్యమైన పాత్రలు పోషించి నటనలో తన ప్రత్యేకతను చాటుకున్న ఆచంట చిరస్మరణీయుడన్నారు. ఆచంట బాలాజీ నాయుడు మాట్లాడుతూ తండ్రి వెంకట రత్నం నాయుడి నటనా వారసత్వాన్ని అందిపుచ్చుకుని రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లో అనేక పౌరాణిక నాటకాలను ప్రదర్శించి ఆయన పేరును నిలబెట్టగలిగినందుకు గర్వంగా ఉందన్నారు. ఆచంటకు నివాళులర్పించిన వారిలో ఏపీ కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపా శేషు, శారదా కళా సమితి వ్యవస్థాపకుడు డోగిపర్తి శంకరరావు, సాహితీవేత్త వెన్నా వల్లభరావు, చివుకుల హరగోపాల్, కళామంజరి వ్యవస్థాపకులు పీవీఎల్ నృసింహం, అల్లూరి మార్కేండేయ రాజు, కొతవరపు గణేష్ కుమార్, చింతా వెంకటేశ్వర్లు, బొజ్జా గౌరీశంకర్ తదితరులు ఉన్నారు.

2 నుంచి కళ్యాణ వేంకటేశ్వర స్వామి మందిర వార్షికోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్):దావు బుచ్చయ్యకాలనీ 9వ రోడ్డులోని శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామివారి దేవాలయంలో వచ్చేనెల 2వ తేదీ నుంచి 4వరకు అష్టమ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త అంగలూరి పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు ఉదయం 8 గంటలకు స్వామివారికి తిరుమంజనం, శత అష్టోత్తర సుదర్శన కళశాభిషేకం ఆలయ అర్చకులచే జరుగుతాయన్నారు. 3వ తేదీ మంగళవారం ఉత్సవ మూర్తులకు నవధాన్య అభిషేకం, స్వామివారిని పెండ్లి కుమారుని చేయటం, సామూహిక హనుమాన్ చాలీసా సహిత పవమాన సూక్త హోమం వేదపండితులచే జరుగుతాయన్నారు. 4వ తేదీ బుధవారం ప్రత్యేక అర్చనలు అభిషేకాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం గ్రామోత్సవం, లోక కళ్యాణార్థం స్వామివారి కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామని తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశామన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాలని కోరారు.

13న వీఎంసీ కౌన్సిల్ సమావేశం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాలపై మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జూన్ 13వ తేదీన వీఎంసీ సాధారణ కౌన్సిల్ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు వీఎంసీ అధికారులు తమ విభాగాలకు చెందిన ప్రశ్నలకు సమాధానాలు, ప్రియాంబుల్ అంశాలను ను జూన్ 4వ తేదీలోగా వీఎంసీ సెక్రటరీ సెల్‌కు అందిచాలని సెక్రటరీ వసంతలక్ష్మి బుధవారం సర్క్యులర్ జారీ చేశారు.

5న ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్థానిక భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయ చతుర్ద వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 5వ తేదీన అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి పేర్కొన్నారు. 5వ తేదీ గురువారం ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రశన, దేవతా మూర్తులకు అభిషేకాలు, విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఉదయం 11 గంటలకు సువర్చలా సమేత ఆంజనేయ స్వామి వార్ల శాంతి కల్యాణోత్సవం చేస్తామన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తామని చెప్పారు.

వార్డ్, సర్కిల్ స్థాయిలో యోగాంధ్ర పోటీలు



యోగాసనం చేస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఇతర సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా వార్డ్, సర్కిల్ స్థాయి యోగా పోటీలు జరగనున్నాయని, వార్డ్ స్థాయి విజేతలు సర్కిల్ స్థాయికి, సర్కిల్ స్థాయి విజేతలు జిల్లా స్థాయికి, జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయికి అర్హత సాధిస్తారని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. కనకదుర్గ వారధి వద్ద ఉన్న రివర్ ఫ్రంట్ పార్క్‌లో బుధవారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆసనాల ప్రదర్శన (సూర్య నమస్కార్ ఛాలెంజ్, ప్రాణాయామం, మెడిటేషన్), ఆర్టిస్టిక్ యోగా (యోగా సాంగ్, యోగా పెయింటింగ్, యోగా స్కిట్, రోల్‌ప్లే), వైజ్ఞానికి యోగా (యోగా క్విజ్, యోగా పోస్టర్, యోగా స్లోగన్, యోగా ఎస్సే), యోగా షార్ట్‌ఫిల్మ్, యోగా ఫొటోగ్రఫీలో పోటీలు జరుగుతాయని తెలిపారు. గ్రూప్ విభాగంలో సింక్రనైజ్డ్ గ్రూప్, మిక్స్‌డ్ ఏజ్ గ్రూప్ విభాగాల్లో యోగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూనియర్ గ్రూప్ (10–18 ఏళ్లు), యంగ్ గ్రూప్ (19–35 ఏళ్లు), సీనియర్ గ్రూప్ (35 ఏళ్లు, ఆపైన) కేటగిరీల్లో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. వార్డు స్థాయి పోటీలు మే 26 నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఔత్సాహికులు ఆయా వార్డ్ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు.

10లోగా పంపాలి..

యోగా స్లోగన్, యోగా షార్ట్‌ఫిల్మ్, యోగా ఫొటోగ్రఫీ విభాగాల్లో పోటీ పడాలనుకునే ఔత్సాహికులు తమ ఎంట్రీలను జూన్ 10వ తేదీలోగా వీఎంసీయోగాంధ్ర ః జీమెయిల్‌కు పంపాలని సూచించారు. తమ ఎంట్రీలతో పాటు పేరు, చిరునామా, మొబైల్ నంబరు వివరాలతో నమోదు చేసుకోవాలని తెలిపారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి అవార్డులు అందిస్తామన్నారు. ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.షమీ, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) విభాగం పి.వెంకట నారాయణ, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మతం పేరిట చిచ్చు పెట్టే విధానాలు తగవు



జంక్షన్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాజకీయ అవకాశాల కోసం ప్రజల మధ్య మతం పేరిట చీలికలు తెచ్చే విధానాలను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. సీపీఎం, ముస్లిం మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్‌లో బుధవారం 'సమైక్యతా యాత్ర' నిర్వహించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రధాన కూడలి మీదగా విజయవాడరోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ వరకు ప్రదర్శన సాగింది. ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మాదం నశించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దేశ సమైక్యత, లౌకికవాదం వర్ధిలాలి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఉగ్రవాదులను అడ్డుపెట్టుకుని ఓ వర్గాన్ని రెచ్చగొడుతూ మరో వర్గంపై దాడులను బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రోత్సహిస్తున్నాయన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లం వెంకటేశ్వరరావు, మాదాల వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి బేతా శ్రీనివాసరావు, మండల మాజీ కార్యదర్శి అబ్దుల్ బారీ, ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు షేక్ అబ్దుల్లా, షేక్ నజీర్, షేక్ మీరా, షేక్ గౌస్ బాషా పాల్గొన్నారు.

'ప్రజలకు మంచి చేశామని చెప్పే ధైర్యం ఉందా ?'

వించిపేట(విజయవాడపశ్చిమ): తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన మహానాడు ఒక పెద్ద డ్రామా అని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాజీబాబా బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేశామని చెప్పే ధైర్యం లేని తెలుగుదేశం నేతలు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టడం కోసమే మహానాడు డ్రామాలకు దిగిందని ఆరోపించారు. టీడీపీ నేతలు రాష్ట్రంలో ఏ ఇంటికైనా వెళ్లి కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామిల గురించి మాట్లాడే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. సత్తా అంటే కడపలో మహానాడు పెట్టడం కాదని.. ఇచ్చిన హామీలు నెరవేర్చడమే నిజమైన సత్తా అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులు ఎక్కువ జరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు నారా హమార కార్యక్రమం చేపట్టి అదే మైనార్టీలపై దేశద్రోహం కేసులు పెట్టిన చరిత్రను మైనార్టీలు మర్చిపోలేరన్నారు. కోవిడ్ వంటి కష్ట కాలంలో రాష్ట్రానికి ఆదాయం లేని సమయంలో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ నాడు ప్రజలకు చేయాల్సిన సంక్షేమం అభివృద్ధిని పక్కనపెట్టలేదని తెలిపారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి మాట తప్పని నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని కొనియాడారు.

సృజనాత్మకత విద్యార్థి భవితకు వెలుగుబాట



శిబిరంలోని బాల బాలికలకు విజ్ఞానదాయక పుస్తకాలను అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: సృజనాత్మకత విద్యార్థి భవితకు వెలుగుబాట అని సాహితీవేత్త స్వర్ణ వెంకటనారాయణ అన్నారు. గ్రంథాలయ పునర్వికాస వేదిక, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, స్వేచ్ఛ ఆంధ్ర ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో బాల బాలికల కోసం బుధవారం నిర్వహించిన శిక్షణ శిబిరానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకం మన ఆత్మీయ నేస్తమని చెప్పారు. పునర్వికాసవేదిక నిర్వహిస్తున్న శిక్షణా శిబిరంలో ప్రతిభకు పట్టం కడుతూ బాల బాలికల ప్రతిభకు మెరుగులు దిద్దుతున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా నిర్వాహకులు వేదగణితం, బొమ్మలు గీయడం ఎలా, చిత్రలేఖనంలోని ఆధునిక పద్ధతులు అంశంగా అవగాహన కలిగించారు. గ్రంథాలయ పునర్వికాసవేదిక నిర్వాహకులు గోళ్ళ నారాయణరావు, సింగంపల్లి అశోక్‌కుమార్, క్లాసిక్ పబ్లికేషన్స్ రాము, కె.శ్రీనివాస్, శోభన్ పాల్గొన్నారు. బాల బాలికలకు విజ్ఞానదాయక పుస్తకాలు పంపిణీ చేశారు.

యువత దేశ రక్షణలో భాగస్వాములు కావాలి



సీడీ ఆవిష్కరిస్తున్న మల్లికార్జునరావు, హజరత్తయ్యగుప్తా ఎంసీదాస్ తదితరులు

విజయవాడ కల్చరల్: యువత దేశ రక్షణలో భాగస్వాములు కావాలని తపస్వి కల్చరల్ ఆర్ట్స్ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ఏపీ సృజనాత్మక సమితి, తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్రనాటక కళాసమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని జీవీఆర్ సంగీత కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. యుద్ధంలో వీరమరణం పొందిన భారత జవాన్లకు ఘననివాళి, ఓ త్యాగమయిలారా సీడీ ఆవిష్కరణ, ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. గుప్తా మాట్లాడుతూ దేశరక్షణ కోసం అనుక్షణం తపిస్తూ జీవితాలను త్యాగం చేస్తున్న సైనికులు సదా స్మరణీయులని కొనియాడారు. సీడీని ఆవిష్కరించిన ఏపీ సృజనాత్మక సమితి సీఈవో ఆర్.మల్లికార్జునరావు మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించదగిన నటుడు నందమూరి తారక రామారావు అని అభివర్ణించారు. సాంస్కృతిక శాఖ ద్వారా కళాకారుల అభివృద్ధికి కృషి చేస్తునట్లు తెలిపారు. విద్యావేత్త ఎంసీదాస్ మాట్లాడుతూ భారతదేశ సైనిక శక్తికి ప్రపంచమే పాదా క్రాంతమైందన్నారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్ కార్యదర్శి సూర్యదేవర జగన్నాధరావు సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో వేమూరి నాగేశ్వరశర్మ, కుమార సూర్యనారాయణ, గాయని సుధాశ్రీనివాస్, తపస్వి పాల్గొన్నారు. హేమంత్‌కుమార్ బృందం దేశ భక్తి గీతాలకు నృత్యాలను అభినయించింది. వీర్లప్రసాద్ రచించి, వెనిగళ్ళ భాస్కర్ దర్శకత్వం వహించిన వామ్మో గుత్తి వంకాయ్ హాస్యనాటికను ప్రదర్శించారు.

సహనాన్ని పరీక్షిస్తున్న వాటర్ వర్క్స్ పనులు

- రాకపోకలకు తప్పని తిప్పలు
- దిగబడుతున్న వాహనాలు



రోడ్డు సక్రమంగా లేకపోవటం వల్ల కృంగిపోయిన ట్రాక్టర్

మధురానగర్(విజయవాడసెంట్రల్):దావు బుచ్చయ్యకాలనీలో వాటర్ వర్క్స్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇందుకుగానూ అంతర్గత రోడ్లలో సైతం రోడ్డును తవ్వి పైపులైన్‌లు వేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ తవ్విన గోతులను మాత్రం తూతూమంత్రంగా మట్టిని పోసి వదలి వేస్తున్నారు. దీంతో రాకపోకలకు వాహన చోదకులు నానాయాతన పడుతున్నారు. రోడ్డును సరిచేయాలని ఎన్నిమార్లు కోరినప్పటికీ పట్టించుకున్న వారే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల దావు బుచ్చయ్యకాలనీ డొంక రోడ్డు క్రాస్ రోడ్డు ప్రాంతాల్లో పైపులైన్‌లు వేశారు. కానీ రోడ్డును మాత్రం సరిచేయలేదు. దీంతో బుధవారం ఈ రోడ్డులోకి వచ్చిన ట్రాక్టర్ రోడ్డు సక్రమంగా లేకపోవటంతో ట్రాక్టర్ దిగబడిపోయింది. రాకపోకలకు స్థానికులు అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్విన రోడ్డును సరిచేయాలని కోరారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా పనులు వేగవంతం చేయాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

బుడమేరులో గుర్రపు డెక్క తొలగింపు



బుడమేరులో గుర్రపుడెక్క తొలగింపు చర్యలు చేపట్టిన దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్):బుడమేరులో పేరుకుపోతున్న గుర్రపుడెక్కను నగర పాలక సంస్థ మలేరియా విభాగం సిబ్బంది బుధవారం ట్రక్టర్, బోటు సహాయంతో తొలగింపు పనులు చేపట్టారు. బుడమేరులో నిలిచిపోయిన గుర్రపు డెక్కను ట్రక్టర్ సహాయంతో తొలగించారు. అలాగే బుడమేరులో ఇరుక్కుపోయిన గుర్రపు డెక్కను బోటు సహాయంతో తరలించారు. ఈ సందర్భంగా మలేరియా అధికారులు మాట్లాడుతూ నీటి ప్రవాహం నిలిచిపోవటం వల్ల దోమల ఉద్భుతి పెరిగే ప్రమాదం ఉందన్నారు. గుర్రపు డెక్క వల్ల మురుగు నిలిచిపోయి దోమలు పెరిగిపోతున్నాయని తెలిపారు. దోమల నివారణ చర్యలలో భాగంగా తాము గుర్రపు డెక్కతో పాటు నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించే వాటిని తొలగిస్తున్నట్లు తెలిపారు. ఎవరికి వారు తమ చెత్త చెదారంను బుడమేరులో వేస్తున్నారని దీనివల్ల మురుగు ప్రవాహనికి ఆటంకం కలుగుతుందన్నారు. సామాజిక బాధ్యతగా చెత్తను పారిశుద్ధ్య సిబ్బందికి మాత్రమే ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా విభాగం అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

భూగర్భ డ్రెయినేజీ సమస్యలపై చర్యలు



భూగర్భ డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): భూగర్భ డ్రైనేజీ సమస్యలు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. బాలాజీ నగర్, సిమెంట్ గోడౌన్, కృష్ణలంక ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. కృష్ణలంక బాలాజీ నగర్‌లో భూగర్భ డ్రెయినేజీ పొంగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వచ్చిన ఫిర్యాదుపై స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భూగర్భ డ్రెయినేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిమెంట్ గోడౌన్ వద్ద అమృత్ 2.0 పథకం ద్వారా రూ.2.8 కోట్ల నిధులతో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులు పరిశీలించారు. నిర్మాణంలో ఎటువంటి సమస్యలున్న తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన ఖాకీలపై చర్యలు తీసుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాజ్యాంగాన్ని ఉల్లంఘించి తెనాలిలో నడిరోడ్డుపై ముగ్గురు దళిత, మైనార్టీ యువకులను అత్యంత దుర్మారంగా కొట్టిన ఖాకీలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మద్దిరాల కమలాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం రాక్షస పాలనకు ఈ దుర్ఘటన నిదర్శనమన్నారు.